Follow: @mahaadaily
REGISTERED NUMBER: APTEL/2014/58382
20-12-2025
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 361 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD
శనివారం
WWW.EPAPER.MAHAADAILY.COM




ప్రత్యేక కథనం 4లో

టాప్ న్యూస్

## కమలం గూటికి నటి ఆమని

- నేడు మధ్యాహ్నం 12 గంటలకు బీజేపీలో చేరిక



02

## ఇన్‌స్టాగ్రామ్ కొత్త రూల్

- యూజర్లకు అలర్ట్


03

## హైదరాబాద్‌లో రకుల్ ప్రీత్

- రీఎంట్రీపై సంచలన వ్యాఖ్యలు
- తెలుగు సినిమాలను మిస్ అవుతున్నా




03



## మగిసిన పార్లమెంట్ సమావేశాలు

### వాడివేడిగా వింటర్ సెషన్

**ఢిల్లీ, మహా:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. డిసెంబర్ 1న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. మొత్తం 15 రోజుల పాటు పార్లమెంట్ ఉభయ సభలు పనిచేశాయి. శుక్రవారం లోక్‌సభలో సభ్యులు జాతీయ గీతం ఆలపించిన తర్వాత స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేశారు. మిగతా 2లో




# సహకార సమరం

## సీఎం రేవంత్ అనూహ్య ఎత్తుగడ

### 9 డీసీసీబీలు.. 906 పీఏసీఎస్ లకు.. త్వరలోనే ఎన్నికలు

### రిజర్వేషన్లు లేకపోవడంతో పాతపద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించే ఛాన్స్

### గత ఎన్నికల తరహాలోనే విడతల వారీగా ఎన్నికలు.. ఎక్కువగా ఏకగ్రీవమయ్యే ఛాన్స్

**హైదరాబాద్, మహా:** గ్రామపంచాయతీ ఎన్నికల విజయాల ఊపులో ఉన్న ప్రభుత్వం సహకార సమరానికి సై అంటోంది. అందరూ ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికలపై చర్చించుకుంటుండగా, రిజర్వేషన్లతో సంబంధం లేని సహకార ఎన్నికలను పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. పొడిగింపులతో సాగుతున్న రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్లు, డైరెక్టర్ల పాలక వర్గాలను ప్రభుత్వం రద్దు చేసింది. తొమ్మిది జిల్లాల డీసీసీబీలను కూడా పాలకమండళ్ల కాలపరిమితి ముగియడంతో రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం డీసీసీబీల బాధ్యతలు కలెక్టర్లు స్వీకరించారు. పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించాలని వ్యవసాయశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ ఇన్‌ఛార్జిలు కొనసాగుతారని పేర్కొంది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల ప్రకారం తొమ్మిది డీసీసీబీలు, వీటి పరిధిలో 906 పీఏసీఎస్ లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షలమందికి పైగా రైతులు ఈ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. పంచాయతీ ఊపులో ఉన్న సీఎం ఈ సహకార ఎన్నికలను సంక్రాంతి సమయంలో మిగతా 2లో



## తెలంగాణలో మావోయిస్టు పార్టీకి బిగ్ షాక్

### డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన 41 మంది మావోయిస్టులు

### సీఎం రేవంత్ పిలుపుమేరకే లొంగుబాటు

### గణపతి, మల్లరాజారెడ్డి కూడా శాంతిమార్గంలోకి రావాలి డీజీపీ శివధర్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో మావోయిసస్టుపార్టీకి బిగ్ షాక్ తగిలింది. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కి చెందిన 41 మంది మావోయిస్టు క్యాడర్ తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో చేరారు. ఈ లొంగుబాటుతో పార్టీకి కోలుకోలేని నష్టం వాటిల్లినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. లొంగిపోయిన వారిలో దాదాపు 24 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్, 21 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న కోర్సా లచ్చు, కనికారపు ప్రభంజన్, అర్బన్ ఏరియా, పీడీఎస్‌యూ సభ్యుడితో పాటు ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు ), 12 మంది ఏరియా కమిటీ సభ్యులు 23 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. ఈ మేరకు వారి నుంచి గన్స్, మూడు AK47 రైఫిల్స్, ఐదు ఎస్ ఎల్ ఆర్ రైఫిల్స్, ఏడు ఎన్ సాస్ రైఫిల్స్, ఒక బీజీఎల్ గన్, నాలుగు యూబీజీఎల్ తుపాకులు, ఒక 303 రైఫిల్, మిగతా 2లో



## 23 నుంచి బడులకు క్రిస్మస్ సెలవులు

### షెడ్యూల్ విడుదల చేసిన సర్కారు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు క్రిస్మస్ సెలవుల షెడ్యూల్‌ను సర్కారు ఖరారు చేసింది. పండుగ మిగతా 2లో




## వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో బదిలీల కలకలం

### పోస్టింగ్ లో ఆరు నెలలకే పరిమిత మవుతున్న అధికారులు

### డబ్ల్యూఎస్టి లో మూడు స్టేషన్లకు బదిలీలు తప్పవా?

**వరంగల్, మహా ;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరంగల్ హన్మకొండ నగరంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారుల కుర్చీలు కదలనున్నాయా? పోలీసు అధికారులు విధి నిర్వహణ పక్కన పెట్టి పలు వివాదాల్లో తలదూరుస్తున్న ఇన్‌స్పెక్టర్ల పై బదిలీ వేటు మిగతా 5లో




## కొండగట్టు అంజన్నపై పవన్ కళ్యాణ్ భక్తి

- టీటీడీ నుండి రూ. 30 కోట్ల నిధుల మంజూరు!
- మొక్కు తీర్చుకున్న డిప్యూటీ సీఎం
- వారాహి సాక్షిగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జనసేనాని
- అంజన్న చెంత భక్తుల కోసం అత్యాధునిక వసతులు!


**హైద్రాబాద్, మహా:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన ఇష్టదైవమైన కొండగట్టు అంజన్నపై ఉన్న భక్తిని చాటుకున్నారు. రాజకీయ ప్రస్థానంలో తనకు వెన్నంటి ఉండి, విజయాలను చేకూర్చిన ఆ క్షేత్ర అభివృద్ధి కోసం ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తన సిఫార్సు మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నుండి ఏకంగా 30 కోట్ల రూపాయల భారీ నిధులను మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. మిగతా 2లో

## బ్రహ్మపుత్రపై చైనా జల యుద్ధం

- 14.5 లక్షల కోట్లతో డ్రాగన్ 'సూపర్ డ్యామ్'
- జల గండం నుంచి గట్టెక్కేలా భారత్ వ్యూహం
- అరుణాచల్ ప్రదేశ్‌లో భారీ రిజర్వాయర్.. చైనాకు చెక్!



**ఢిల్లీ, మహా:** పొరుగు దేశం చైనా మరోసారి తన కుటిల బుద్ధిని ప్రదర్శిస్తోంది. సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకే పరిమితం కాకుండా, ఇప్పుడు నదీ జలాలను ఆయుధంగా మలుచుకుని భారత్‌ను ఇబ్బందుల్లోకి నెట్టేందుకు కుట్ర పన్నుతోంది. బ్రహ్మపుత్ర నదిపై గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత భారీ స్థాయిలో 'సూపర్ డ్యామ్' నిర్మాణానికి చైనా శ్రీకారం చుట్టింది. సుమారు 14.5 లక్షల కోట్ల భారీ వ్యయంతో టిబెట్ స్వయంప్రతిపత్తి మిగతా 3లో



## తెలంగాణ ప్రో బాస్కెట్‌బాల్ లీగ్

### పోటీలను ప్రారంభించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రో బాస్కెట్ బాల్ పోటీలను టీపీసీసీ అధ్యక్షులు , ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. యువతలో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం పెంపొందించడంలో ఇలాంటి లీగ్‌లు కీలకమని పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి, యువ క్రీడాకారులకు మరింత అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. స్టేడియం నిండా ఉత్సాహం క్రీడాభిమానుల హర్షధ్వానాల నడుమ లీగ్ ప్రారంభమైంది.

## పేద విద్యార్థి విద్యారుణం కోసం తన ఇల్లు ష్యూరిటీ పెట్టిన మాజీ మంత్రి హరీష్ రావు

- విద్యార్థి వ్యక్తిగత అవసరాల కోసం లక్ష రూపాయలు ఇచ్చిన నేత
- చర్చనీయాంశమైన హరీష్ ఉదారత



**సిద్ధిపేట, మహా :** సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఉదారతను చాటుకున్న తీరు ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ, సామాన్య ప్రజల్లోనూ పెద్ద ఎత్తున చర్చనీయాంశమవుతోంది. పేద విద్యార్థుల చదువు కోసం రాజకీయ నాయకులు సాయం చేయడం చూస్తుంటాం, కానీ ఒక విద్యార్థిని భవిష్యత్తు కోసం తన సొంత ఇంటినే హరీష్ రావు బ్యాంకులో తాకట్టు పెట్టారు. రాజకీయాల్లోనే కాదు, మానవత్వంలోనూ తనకు సాటి లేరని హరీశ్ రావు మరోసారి నిరూపించుకున్నారు. ఆపదలో ఉన్నామంటూ తన గడప తట్టిన ఒక సామాన్య టైలర్ కుటుంబానికి ఆయన కొండంత అండగా నిలిచారు. పీజీ వైద్య విద్య చదవాలని కలలు కంటున్న మిగతా 3లో

## రెండేళ్లలోనే తెలంగాణకు కొత్త దిశ

### ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం

- మారుతున్న కాలానికి అనుగుణంగా పనితీరు మారాలి
- పీఆర్ఓల వర్క్‌షాపులో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం, రెండేళ్ల పాలనలోనే తెలంగాణకు స్పష్టమైన కొత్త దిశను చూపించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజలు ఏ మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచారో, ఆ మార్పును కేవలం రెండేళ్లలోనే ప్రజల కళ్ల ముందుంచి నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ, మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని మీడియా అకాడమీలో జిల్లా ప్రజా సంబంధాల అధికారులతో మిగతా 2లో

# తెలంగాణలో మావోయిస్టు పార్టీకి బిగ్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

రెండు సింగిల్ షాట్ రైఫిల్స్, 24 ఎయిర్ గన్స్, 733 బీజీఎల్ షెల్స్, 08 షెల్స్ సహా భారీ మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆయుధాల మొత్తం విలువ రూ.కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**సీఎం రేవంత్ పిలుపుమేరకు లొంగిపోయారు- డీజీపీ శివధర్ రెడ్డి**

మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు, పునరావాస విధానాల నేపథ్యంలో పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ శివధర్ రెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు, ప్రభుత్వ పునరావాస విధానాలు, అనారోగ్య సమస్యలు మరియు అడవిలో మారుతున్న పరిస్థితుల వల్ల వీరంతా బయటకు వచ్చినట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. ప్రతి ఒక్కరికీ పునరావాసం ప్యాకేజీ కింద లొంగిపోయిన 41 మందికి కలిపి ప్రభుత్వం తరపున మొత్తం రూ.1.46 కోట్ల నగదు బహుమతిని అందజేయనున్నట్లుగా తెలిపారు. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు ఇవాళ పంపిణీ చేస్తున్నామని అన్నారు. వాటితో పాటు ఆయుధాలకు విడిగా నగదు బహుమతిని కూడా ప్రభుత్వం అందిస్తుందని.. వాటిలో ఎల్ఎంజీ రైఫిల్‌కు రూ.5 లక్షలు, ఏకే472కు 4 లక్షలు ఇస్తామని అన్నారు. ఈ లొంగుబాటు మావోయిస్టులకు పెద్ద దెబ్బ అని, పార్టీలో అంతర్గత గందరగోళం పెరిగిందని డీజీపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర స్థాయి కీలక నేతలు ఉన్నారు. 31 ఏళ్ల సుదీర్ఘ అజ్ఞాతవాసం గడిపిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్, 32 ఏళ్లుగా అడవిలోనే ఉన్న అప్పాసి నారాయణ అలియాస్ రమేష్‌తో పాటు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు ముత్యాకి సోము అలియాస్ ఎర్ర తమ పంథాను మార్చుకున్నారు. ఆజాద్, రమేష్‌లపై ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ. 20 లక్షల చొప్పున రివార్డులు ప్రకటించింది. లొంగిపోయిన మొత్తం 37 మందిపై ఉన్న రివార్డుల విలువ సుమారు రూ. 1,41,05,000 అని, ఈ మొత్తాన్ని నిబంధనల ప్రకారం వారి పునరావాసం కోసం అందజేస్తామని డీజీపీ వెల్లడించారు. ఇంకా అజ్ఞాతంలో ఉన్న సెంట్రల్ కమిటీ సభ్యులు గణపతి (కొంపాల లక్ష్మణరావు), మల్లరాజారెడ్డి, దేవ్జీ, గణేష్, విశ్వనాథ్ వంటి వారు కూడా హింసను వీడి శాంతి మార్గంలోకి రావాలని డీజీపీ పిలుపునిచ్చారు. అడవిలో పోరాటాల వల్ల ఒరిగేదేమీ లేదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావాలని కోరారు. లొంగిపోయే వారికి ఎటువంటి వేధింపులు ఉండవని, ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# సహకార సమరం

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిచేయాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. వీటికి రిజర్వేషన్లతో సంబంధం లేకపోవడం, రాజకీయ జోక్యం తక్కువగా ఉండనుండడంతో ఫటాఫట్ పూర్తి చేయాలని సీఎం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ హయాంలో దేశంలో ఎక్కడా చేయని రీతిలో రుణమాఫీ చేయగా, సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నారు. యూరియా ఇబ్బందులు తీర్చేందుకు ఇపుడు యాప్ ద్వారా యూరియా అందించాలని నిర్ణయించారు. రైతుభరోసా కూడా సమయానికి అందిస్తున్నారు. రైతాంగం మద్దతు రేవంత్ ప్రభుత్వానికి ఉండడం వల్లే పంచాయతీల్లో అద్భుత ఫలితాలు వచ్చాయని, సహకార ఎన్నికలు జరిగినా ఫలితాలు ఏకపక్షంగానే ఉంటాయని అంచనా వేస్తున్నారు.

**ఐదేళ్ళకోసారి**

తెలంగాణలో పెరిగిన జిల్లాలకు అనుగుణంగా డీసీసీబీల సంఖ్యను పెంచాలని గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ప్రయత్నించినా ఆర్ బీఐ నిబంధనలు, నాబార్డు ఆంక్షలు అంగీకరించలేదు. డీసీసీబీలు ఆర్ బీఐ నియంత్రణలో, నాబార్డు పర్యవేక్షణలో పనిచేసే బ్యాంకు. ఆర్ బీఐ విధానం.. విభజన కంటే బ్యాంకుల విలీనానికే మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో డీసీసీబీల విభజన అసాధ్యంగా అధికారులు నిర్ణయానికొచ్చారు. రాష్ట్రంలో ప్రతీ జిల్లాలో పంచాయతీ ఎన్నికల తరహాలో విడతల వారీగా ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ ఇస్తే వారం, పదిరోజుల్లో ఒక్కో విడత ఎన్నికలు పూర్తికానున్నాయి. 2019 డిసెంబర్ 28న ఎన్నికలు జర్గగా, 2020 జనవరి 6 నుండి 18 వరకు వివిధ విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఈ దఫా కూడా అదే తరహాలో ఎన్నికలు జరగవచ్చని తెలుస్తోంది.

**రైతు సంక్షేమం లక్ష్యంగా...**

ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీతో పీఏసీఎస్‌ల పదవీకాలం ముగిసింది. వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)ను ఏర్పాటు చేసింది. ఈ సహకార సొసైటీల నిర్వహణకు ఎన్నికల ద్వారా పాలకవర్గాలను నియమిస్తుంది. సొసైటీల సామర్థ్యాలకు అనుగుణంగా చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఉంటారు. ఎన్నికైన పాలకవర్గాలు ప్రభుత్వం ద్వారా వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి రైతుల సంక్షేమానికి అమలయ్యే పథకాలను అందిస్తాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల ద్వారా ఈ పాలకవర్గాలను ప్రభుత్వం నియమిస్తుంది. 2020, జనవరి ఫిబ్రవరిలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికలు జరపగా, ఈ ఎన్నికల ద్వారా పదవులు పొందిన వారి పదవి కాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. వారి పదవీ కాలాన్ని పొడిగించి ఇపుడు పాలకవర్గాలను రద్దుచేశారు.

**కాంగ్రెస్ దే జోరు**

రాష్ట్రంలో డీసీసీబీ ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ దే జోరు ఉంటుందని, ఒక్క మెదక్ లో పోటీ ఉంటుంది తప్ప మిగతా అన్ని జిల్లాలు కాంగ్రెస్ పార్టీ సునాయాసంగా డీసీసీబీలు, డీసీఎంఎస్ చైర్మన్ పదవులను, డైరెక్టర్ పదవులను కైవసం ,చేసుకుంటుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికిపుడు ఎన్నికలు నిర్వహిస్తుందా.. మరికొంత కాలం వేచిచూస్తుందా అన్నది వారం రోజుల్లో స్పష్టం కానుంది.

## 23 నుంచి బడులకు క్రిస్మస్ సెలవులు

### షెడ్యూల్ విడుదల చేసిన సర్కారు

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో బడులకు విరామం ఇస్తూ విద్యాశాఖ ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ విరామ దినాలను పాఠశాలల స్వభావాన్ని బట్టి రెండు విభాగాలుగా విభజించారు. క్రైస్తవ మత సంబంధిత మిషనరీ పాఠశాలలకు ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సెలవులు ఇచ్చారు. ఈ విద్యాసంస్థలు తిరిగి ఈ నెల 28వ తేదీన పునఃప్రారంభమవుతాయి. మిగిలిన సాధారణ పాఠశాలలకు ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు విరామం ఉంటుంది. ఇవి తిరిగి ఈ నెల 27వ తేదీన యథావిధిగా నడుస్తాయి. పండుగ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ సెలవులను కేటాయించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని విద్యాసంస్థలు ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని విద్యాశాఖ సూచించింది.



## కమలం గూటికి నటి ఆమని

### నేడు మధ్యాహ్నం 12 గంటలకు బీజేపీలో చేరిక

**హైదరాబాద్, మహా:** సినీ నటి ఆమని శనివారం కాషాయ తీర్థం పుచ్చుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆధ్వర్యంలో ఆమె పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు బీజేపీ వర్గాలు అధికారిక ప్రకటన విడుదల చేశాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ తన బలాన్ని పెంచుకునే పనిలో పడింది. ఇందులో భాగంగానే సినీ రంగానికి చెందిన ప్రముఖులను పార్టీలోకి ఆహ్వానిస్తోంది. గతంలోనే పలువురు నటులు బీజేపీలో చేరగా, ఇప్పుడు ఆమని రాక ప్రాధాన్యత సంతరించుకుంది.

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం నుంచే వాడీవేడీగా జరిగాయి. ఇండిగో సంక్షోభం, ఎస్ఐఆర్, ఎన్నికల సంస్కరణలు వంటి అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సమయంలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఈ సెషన్ లో మొత్తం 59 బిల్లులను ప్రవేశపెట్టారు. ఎనిమిది బిల్లులను పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయి. అందులో ఎంజీనరేగా స్థానంలో తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ బిల్లు, పౌర అణు రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లులు, బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బీమా సవరణ బిల్లు సహా మరికొన్ని ఉన్నాయి.

**లోక్ సభ ఉత్పాదకత 111శాతం**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ ఉత్పాదకత 111 శాతంగా ఉందని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభ సజావుగా జరిగేందుకు లోక్‌సభ సభ్యులందరూ సహకరించారని వెల్లడించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించిన ఎంపీలను కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగింపు సందర్భంగా పార్లమెంటు హౌస్‌లోని తన చాంబర్‌లో లోక్ సభలోని పార్టీల నాయకులు, ఎంపీలతో స్పీకర్ ఓం బిర్లా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ సైతం పాల్గొన్నారు.

**121 శాతం పని చేసిన రాజ్యసభ**

రాజ్యసభ వాయిదాకు ముందు సభను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రసంగించారు. ఈ క్రమంలో శీతాకాల సమావేశాలలో రాజ్యసభ ఉత్పాదకత, నిర్మాణాత్మక చర్చలను హైలైట్ చేశారు. ఈ శీతాకాల సమావేశాలు తనకు చాలా ప్రత్యేకమైనవని అన్నారు. ఎందుకంటే తాను రాజ్యసభ ఛైర్మన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సభకు అధ్యక్షత వహించడం ఇదే మొదటిసారి అని అన్నారు. తనకు సహకరించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఎంపీలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రోత్సాహాన్ని గొప్ప ప్రేరణకు మూలంగా అభివర్ణించారు. అలాగే రాజ్యసభ ఉత్పాదకత 121 శాతంగా ఉందని వెల్లడించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ సభ్యులు తనకు బాగా సహకరించారని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. చర్చల సందర్భంగా సభ ఆలస్యమైనా వేచి ఉన్నారని, భోజన విరామాన్ని కూడా దాటవేయడానికి అంగీకరించారని ప్రశంసించారు. ఈ సెషన్ లో భారీ సంఖ్యలో జీరో అవర్ నోటీసులు వచ్చాయని తెలిపారు. సగటున రోజుకు 84 కంటే ఎక్కువ జీరో అవర్ నోటీసులు వచ్చాయని స్పష్టం చేశారు. ఈ నోటీసులు మునుపటి సెషన్లతో పోలిస్తే 31శాతం పెరిగాయని గుర్తు చేశారు.



## ప్రపంచ వేదికపై వలస జీవుల గోస

- **ఆస్కార్ రేసులో 'హోమ్ బౌండ్' అరుదైన మైలురాయి!**
- **అకాడమీ జాబితాలో భారతీయ ముద్ర**
- **పుష్ప, కుబేరాలను దాటి ఆస్కార్ బరిలో నిలిచిన జాన్వీ కపూర్ చిత్రం!**
- **డాల్బీ థియేటర్ సాక్షిగా నీరజ్ ఘైవాన్ మ్యాజిక్..**
- **లాక్‌డౌన్ వేదనకు అంతర్జాతీయ గుర్తింపు**
- **జనవరి 22న తేలనున్న తుది నామినేషన్ల భాగ్యం!**

**హైదరాబాద్, మహా:** ప్రపంచ సినీ యవనికపై భారతీయ జెండా మరోసారి రెపరెపలాడింది. ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ అవార్డుల బరిలో మన దేశం నుంచి 'హోమ్ బౌండ్' చిత్రం సగర్వంగా నిలిచింది. 2026 మార్చి 15న లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్ వేదికగా జరగనున్న ఆస్కార్ వేడుకల కోసం అకాడమీ విడుదల చేసిన 12 విభాగాల షార్ట్‌లిస్ట్‌లో ఈ సినిమా చోటు సంపాదించుకుంది. 2025 ఏడాది పొడవునా విడుదలైన వందలాది చిత్రాలను పరిశీలించిన అకాడమీ, భారత్ నుంచి నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఈ హృద్యమైన గాథను ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో తదుపరి స్థాయికి ఎంపిక చేయడం విశేషం. గతంలో 'ఆర్ఆర్ఆర్' సృష్టించిన ప్రభంజనంతో పెరిగిన ఆస్కార్ ఆశలను ఈ చిత్రం మళ్లీ సజీవం చేసింది. నిజానికి ఈసారి ఆస్కార్ బరిలో భారత్ నుంచి 'పుష్ప 2', 'కుబేరా', 'కన్నప్ప' వంటి భారీ బడ్జెట్ సినిమాలు, కమర్షియల్ హంగులున్న చిత్రాలు ఎన్నో పోటీ పడ్డాయి. అయితే వాటన్నింటినీ వెనక్కి నెట్టి, సామాజిక వాస్తవికతను ప్రతిబింబించిన 'హోమ్ బౌండ్' అకాడమీ సభ్యుల మన్ననలు పొందింది. కోవిడ్ మహమ్మారి సృష్టించిన విలయం, లాక్‌డౌన్ సమయంలో లక్షలాది మంది వలస కార్మికులు పడ్డ వర్ణనాతీత కష్టాలను దర్శకుడు నీరజ్ ఘైవాన్ వెండితెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించారు. చందన్ అనే దళిత యువకుడు, షోయిబ్ అనే ముస్లిం స్నేహితుడు తమ ఊరిని చేరుకోవడానికి చేసిన సాహసోపేత ప్రయాణం చూసేవారి గుండెలను పిండేస్తోంది. కుల వివక్ష, ఆకస్మిక నిరుద్యోగం, పేదరికం వంటి అంశాలను ఏమాత్రం నాటకీయత లేకుండా చూపించడమే ఈ సినిమాకు పెద్ద బలమైంది. నటన పరంగా జాన్వీ కపూర్ తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌ను ఈ చిత్రంలో కనబరిచింది. ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా కూడా తమ పాత్రల్లో ఒదిగిపోయారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కంటెంట్ ఉన్న కథలను ఎంచుకోవడంలో జాన్వీ చూపిస్తున్న పరిణతి ఆమెకు ఆస్కార్ స్థాయి గుర్తింపును తెచ్చిపెట్టింది. టాలీవుడ్‌లో 'దేవర' వంటి మాస్ చిత్రాలతో అలరిస్తూనే, మరోవైపు ఇలాంటి సందేశాత్మక చిత్రాలతో గ్లోబల్ స్క్రీన్‌పై మెరవడం పట్ల విమర్శకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. జనవరి 22న ప్రకటించబోయే తుది నామినేషన్ల జాబితాలో 'హోమ్ బౌండ్' పేరు ఉంటుందని చిత్ర యూనిట్ ఎంతో ధీమాగా ఉంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఇప్పటికే దుమ్మురేపుతున్న ఈ చిత్రం, ఆస్కార్ అందుకుంటే భారతీయ సినిమా కీర్తి కిరీటంలో మరో మణిహారం చేరినట్లవుతుంది.

# కొండగట్టు అంజన్నపై పవన్ కళ్యాణ్ భక్తి

## టీటీడీ నుండి రూ. 30 కోట్ల నిధుల మంజూరు!

### మొక్కు తీర్చుకున్న డిప్యూటీ సీఎం

### వారాహి సాక్షిగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జనసేనాని

### అంజన్న చెంత భక్తుల కోసం అత్యాధునిక వసతులు!

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న ఆలయంతో పవన్ కళ్యాణ్ కు విడదీయలేని అనుబంధం ఉంది. రాజకీయాల్లో కీలక నిర్ణయాలు తీసుకునే ముందు లేదా ఏదైనా మహత్కార్యాన్ని ప్రారంభించే ముందు పవన్ కళ్యాణ్ ఈ ఆలయాన్ని సందర్శించడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో ప్రజారాజ్యం పార్టీ స్థాపన సమయంలోనూ, అనంతరం జనసేన పార్టీ ఆవిర్భావ వేళ కూడా ఆయన ఇక్కడే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా ఏపీలో సంచలనం సృష్టించిన వారాహి యాత్రకు శ్రీకారం చుట్టే ముందు తన వారాహి వాహనానికి కొండగట్టులోనే శాస్త్రోక్తంగా పూజలు చేయించి ఎన్నికల రణక్షేత్రంలోకి అడుగుపెట్టారు. గత ఏడాది వారాహి దీక్షా సమయంలో ఈ ఆలయాన్ని సందర్శించినప్పుడు, అక్కడి మౌలిక సదుపాయాల కొరత , భక్తులు పడుతున్న ఇబ్బందులను ఆలయ అధికారులు పవన్ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న ఆధ్యాత్మిక బంధాన్ని గౌరవిస్తూ, ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని ఆయన నిశ్చయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, తాను ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ మాటను నిలబెట్టుకున్నారు. టీటీడీ ద్వారా మంజూరైన ఈ 30 కోట్ల రూపాయల నిధులతో ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం 100 గదుల వసతి సముదాయాన్ని నిర్మించనున్నారు. అలాగే స్వామివారి దీక్షలు చేపట్టే భక్తుల కోసం ప్రత్యేకంగా ఒక దీక్షా మండపాన్ని కూడా నిర్మించనున్నారు. త్వరలోనే దీనిపై ప్రభుత్వం నుండి మరియు టీటీడీ నుండి అధికారిక ప్రకటన వెలువడనుంది. తన సెంటిమెంట్‌ను కేవలం పూజలకే పరిమితం చేయకుండా, ఆ క్షేత్ర అభివృద్ధికి నిధులు ఇప్పించడం ద్వారా పవన్ కళ్యాణ్ అటు తెలంగాణ భక్తుల మనసులను కూడా గెలుచుకున్నారు.



# కలసి టీ తాగిన కాంగ్రెస్, బీజేపీ

**ఢిల్లీ, మహా:** ఢిల్లీ గడ్డకట్టే చలిలో ఉన్నా, పార్లమెంట్ లోపల మాత్రం ఇన్నాళ్లూ రాజకీయ వేడి కొనసాగింది. అయితే, శీతాకాల సమావేశాల ముగింపు సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన తేనీటి విందులో రాజకీయ వైరానికి తావులేకుండా పోయింది. ఈ పార్టీలో ప్రధాన ఆకర్షణగా నిలిచారు వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ. రాహుల్ గాంధీ అందుబాటులో లేకపోవడంతో కాంగ్రెస్ ప్రతినిధిగా ఆమె హాజరయ్యారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పక్కన కూర్చున్న ప్రియాంక, అటువైపు ఉన్న ప్రధాని మోదీతో సరదాగా ముచ్చటించారు. "అలర్జీలను తగ్గించుకోవడానికి ఇటీవల వాయనాడ్ వెళ్ళినప్పుడు అక్కడ దొరికే ఒక మూలికను వాడాను.. అది బాగా పనిచేస్తోంది" అని ఆమె చెప్పగానే, మోదీ, రాజ్‌నాథ్ పగలబడి నవ్వారు. అప్పుడే ప్రధాని విదేశీ పర్యటనల గురించి ప్రియాంక ఆరా తీయగా.. "చాలా బాగా జరిగాయి" అని మోదీ బదులిచ్చారు. సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ.. "సమావేశాలు మరికొన్ని రోజులు నిర్వహిస్తే బాగుండేది సార్" అని ప్రధానితో అన్నారు. దానికి మోదీ తనదైన శైలిలో స్పందిస్తూ.. "మీరు సభలో ఎంత గట్టిగా వాదిస్తారో తెలుసు.. మీ గొంతు నొప్పి రాకూడదనే తక్కువ రోజులు పెట్టాం" అని చమత్కరించడంతో అక్కడ నవ్వులు విరిశాయి. పాత పార్లమెంట్ భవనంలోని 'సెంట్రల్ హాల్' లాంటి ఏర్పాటు ఇక్కడ కూడా ఉండాలని ఎంపీలు కోరగా.. "అది పదవీ విరమణ చేసిన వారికి.. మీరు ఇంకా దేశానికి చాలా సేవ చేయాల్సి ఉంది, ఇప్పుడే విశ్రాంతి వద్దు" అని ప్రధాని అనడంతో ఎంపీలందరూ ఒక్కసారిగా నవ్వారు. ఎన్.కె. ప్రేమచంద్రన్ లాంటి ఎంపీలను సభకు బాగా సన్నద్ధమై వస్తున్నారంటూ ప్రధాని ప్రశంసించడం విశేషం. గతంలో స్పీకర్ టీ పార్టీలను బహిష్కరించిన ప్రతిపక్షం, ఈసారి మాత్రం పూర్తిస్థాయిలో హాజరైంది. స్పీకర్ నిర్ణయాల పట్ల మల్లికార్జున్ ఖర్గే సంతృప్తి వ్యక్తం చేస్తూ అందరినీ పంపడం ఒక సానుకూల పరిణామం. సుప్రియా సూలే, డి. రాజా వంటి హేమాహేమీలు కూడా ఈ 20 నిమిషాల పార్టీలో పాలుపంచుకుని, రాజకీయ పోరాటాల మధ్య మానవ సంబంధాలు ముఖ్యం అని చాటి చెప్పారు.

# ఒత్తిడిలో బీఆర్ఎస్

### అనుకూలంగా లేని మీడియా టార్గెట్

**హైదరాబాద్, మహా:** గత రెండేళ్ళుగా ఎదురవుతున్న వరుస ఓటములతో ఒత్తిడిలో ఉన్న బీఆర్ఎస్ ఇంకా సోషల్ గ్రౌండ్ లోనే యుద్ధం చేస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల రామన్నా.. బీఆర్ఎస్ పనిచేయాల్సింది ప్రజల్లో సోషల్ మీడియాలో కాదు అంటూ హితవు పలికింది. తర్వాత కూడా అదే సోషల్ గ్రౌండ్ ను నమ్ముకుని అటు జూబ్లీహిల్స్ బైపోల్ లో, ఇటు పంచాయతీ ఎన్నికల్లో చతికిలపడింది. తెల్లారితే సీఎంపై విమర్శలు చేసేందుకు ప్రత్యేక సోషల్ మీడియా వ్యవస్థను ఏర్పాటుచేసుకున్న బిఆర్ఎస్ తమకు అనుకూలంగా లేని ఇతర మీడియాను టార్గెట్ చేస్తోంది. అనుభవజ్ఞులైన జర్నలిస్టుల నిర్వహణలో నడుస్తున్న ఎఎన్ఎన్ ఛానల్ కు బిఆర్ఎస్ పార్టీ నోటీసులిచ్చినట్లు ఆ పార్టీకి చెందిన వ్యక్తులు పలు సోషల్ మీడియా హ్యాండిల్స్ లో శుక్రవారం పోస్టులు పెట్టారు. తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 87 నియోజకవర్గాల్లో ఆధిక్యం సాధించగా, బిఆర్ఎస్ కేవలం ఆరు నియోజకవర్గాల్లోనే ఆధిక్యం సాధించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి కారణాల్లో బీఆర్ఎస్ అనుబంధ సోషల్ మీడియా కూడా కారణమన్న చర్చ ఆ పార్టీ సీనియర్ నేతల పోస్ట్ మార్టం లో వ్యక్తమైంది. కేసీఆర్ ఆలోచనలకు భిన్నంగా బిఆర్ఎస్ సోషల్ మీడియా టీమ్ కేటీఆర్ ను కూడా తప్పుదోవపట్టించే విధంగా పనిచేస్తున్నదన్న ప్రచారం ఆ పార్టీలోనే ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమయంలో ఎఎన్ఎన్ పై పలువురు బెదిరింపులకు దిగగా, ఇపుడు పంచాయతీ ఎన్నికలు ముగిసిన అనంతరం మళ్ళీ ఎఎన్ఎన్ కు నోటీసులు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు.

# వెన్నుపోటు రాజకీయాల వల్లే పార్టీకి నష్టం

- **ఏఐసీసీ, పీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేస్తా**
- **వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సంచలన ప్రకటన**

**వనపర్తి, మహా:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాల వల్ల కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలకు నష్టం జరిగిందని, సీనియర్ నేత వెన్నుపోటు వల్ల వనపర్తి నియోజకవర్గంలో 15 పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై ఏఐసీసీ, పీసీసీ క్రమశిక్షణ కమిటీలకు ఆధారాలతో సహా అందజేస్తానన్నారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలో ని 140 గ్రామపంచాయతీ స్థానాలకు ఇటీవల జరిగిన గ్రామసర్పంచ్ , వార్డు సభ్యుల ఎన్నికలలో రెండేళ్ల కాంగ్రెస్ పాలన పై ప్రజలు తమ సంతృప్తిని ఓటు రూపంలో తెలియజేశారని, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికలలో గ్రామీణ ప్రాంతాలలో 35.09 శాతం పెరిగిందన్నారు. బీ.ఆర్.ఎస్ పార్టీకి వచ్చిన 51 గ్రామపంచాయతీ స్థానాలలో 1520 స్థానాలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందే అవకాశం ఉన్నా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వెన్నుపోటు రాజకీయాల కారణంగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు నష్టం జరిగిందని ఆరోపించారు. ఈ విషయమై ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీకి, హైకమాండ్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానన్నారు. ఎమ్మెల్యే గా నాపై, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పై కోపం ఉంటే నేరుగా తమపై చూసుకోవాలని, కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ,జెండా మోసిన కార్యకర్తలను టార్గెట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులమని చెప్పుకుంటూ పార్టీకి ద్రోహం చేసే వాళ్ళ తీరును కాంగ్రెస్ పార్టీ మేధావులు ,ప్రజలు గమనిస్తున్నారని, సీనియర్ నాయకులు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# వర్నిలో నకిలీ నోట్ల కలకలం

- **బ్యాంకుకు రైతు తెచ్చిన రూ. 2.08 లక్షలు దొంగ నోట్లే!**
- **అప్పు తీర్చబోతే అడ్డంగా బుక్కయ్యాడు**
- **నిజామాబాద్ జిల్లాలో భారీగా పట్టుబడ్డ నకిలీ కరెన్సీ**

**హైదరాబాద్, మహా:** నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో నకిలీ నోట్లు కలకలం సృష్టించాయి. పంట రుణం తీర్చి అప్పుల బాధ నుంచి విముక్తి పొందాలని భావించిన ఒక రైతుకు ఊహించని షాక్ తగిలింది. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన నరెడ్ల చిన్న సాయిలు అనే రైతు గతంలో స్థానిక కెనరా బ్యాంకులో రుణం తీసుకున్నారు. ఆ అప్పును చెల్లించేందుకు గురువారం మధ్యాహ్నం ఆయన రూ. 2,08,500 నగదుతో బ్యాంకుకు చేరుకున్నారు. కౌంటర్‌లో ఆయన ఇచ్చిన నగదును బ్యాంకు సిబ్బంది లెక్కిస్తుండగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. చిన్న సాయిలు తెచ్చిన నగదులో అన్నీ రూ. 500 నోట్లే ఉండగా, అవి నకిలీవని బ్యాంకు సిబ్బంది యంత్రాల సహాయంతో గుర్తించారు. ఏకంగా రూ. 2 లక్షలకు పైగా నకిలీ నోట్లు రావడంతో అప్రమత్తమైన బ్యాంక్ అధికారులు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నగదు మూలాల గురించి రైతును గట్టిగా నిలదీయడంతో, భయాందోళనకు గురైన చిన్న సాయిలు బ్యాంకు నుంచి తప్పించుకుని పరారయ్యారు. రంగంలోకి దిగిన పోలీసులు బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే, ఈ ఘటన వెనుక పెద్ద స్కామ్ ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు రైతు ఇటీవల తన ధాన్యపు పంటను ఒక బ్రోకర్ ద్వారా మిల్లర్లకు విక్రయించగా, దానికి ప్రతిఫలంగానే ఈ నగదు అందినట్లు ప్రాథమిక సమాచారం. తన సోదరి ఇచ్చిన డబ్బును కూడా కలిపి రైతు బ్యాంకుకు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. అమాయక రైతును బ్రోకర్లు మోసం చేశారా? లేక దీని వెనుక ఏదైనా నకిలీ నోట్ల ముఠా హస్తం ఉందా? అనే కోణంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# రెండేళ్లలోనే తెలంగాణకు కొత్త దిశ

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం నిర్వహించిన పునశ్చరణ తరగతులకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ “మేం అధికారం చేపట్టినప్పుడు తెలంగాణ అన్ని రంగాల్లో తీవ్రమైన సంక్షోభంలో ఉంది. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆ సంక్షోభం నుంచి బయటపడి, అభివృద్ధి-సంక్షేమాలను పరుగులు పెట్టిస్తున్నాం” అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదవాడికి అండగా నిలిచామని తెలిపారు. వ్యవసాయం, విద్యా, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వంటి ప్రతి రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెడుతున్నాయన్నారు. అయితే, ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ప్రజల్లోకి చేరడం లేదన్నారు. ప్రజలకూ ప్రభుత్వానికీ వారధిగా ఉండాల్సిన ప్రజా సంబంధాల అధికారుల పాత్ర మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుత మీడియా మార్పులకు అనుగుణంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియా సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వేగంగా విస్తరిస్తున్న సోషల్ మీడియాను ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి శక్తివంతమైన సాధనంగా వినియోగించాలన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి విజయవంతంగా అమలవుతున్న ప్రభుత్వ పథకాలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటిని ప్రజలకు చేరేలా సృజనాత్మక ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు సమర్థవంతమైన డీపీఆర్‌వోలను నియమించాలని, ఇతర విభాగాలలో ఉన్నవారి డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఐ అండ్ పీఆర్ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి,ఐడీసీ ఛైర్మన్ మువ్వ విజయబాబు, ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, సీఎం సీపీఆర్వో జి. మల్సూర్ పాల్గొన్నారు.

ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, తిరుపతి | 20-12-2025 | జనరల్ న్యూస్ | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM


## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి


**జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్ కుమార్**



**బెల్లంపల్లి,మహా:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అంతేకాకుండా పాఠశాలలో టాయిలెట్స్ నిర్వహణ మెరుగుపడాలని జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్ కుమార్ పిలుపునిచ్చారు.శుక్రవారం రోజు వేమనపల్లి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేమనపల్లి తోపాటు కొత్తపల్లి పాఠశాలలను జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వేమనపల్లి పాఠశాలలోని టాయిలెట్స్ నిర్వహణను సరిగ్గా చేయాలని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులకు మరియు పారిశుధ్య నిర్వహకురాలికి సూచించారు.జిల్లా కలెక్టర్ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరకు, టాయిలెట్స్ మరియు పాఠశాలల పరిసరాల్లోమెరుగైన నిర్వహణ కొరకు డి ఎం ఎస్ టి నిధుల నుండి స్కూల్ ఫెసిలిటీ అండ్ మెంటెనెన్స్ నిధులను ప్రతినెల మంజూరు చేస్తున్నారని, కాబట్టి కలెక్టర్ ఆకాంక్షల మేరకు ప్రతి పాఠశాలలోను ఉదయంపూట ఒకసారి మధ్యాహ్నం పూట రెండవసారి ప్రతిరోజు టాయిలెట్స్ ను శుభ్రం చేయించి దుర్వాసన రాకుండా చూడాలని, 2 సార్లు శుభ్రం చేసిన సమయాన్ని ప్రత్యేకంగా ఒక రిజిస్టర్లో నమోదు చేయించి ప్రధానోపాధ్యాయులు సంతకం చేయాలని జిల్లాప్లానింగ్ & ఎమ్మెస్ కోఆర్డినేటర్ భరత్ కుమార్ వేమనపల్లి పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయునికి సూచించారు. ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదును ఎం ఎస్సి రాజ్ కుమార్ పరిశీలించారు.ఎఫ్ ఎల్ ఎస్ పరీక్ష సన్నద్ధత పైన జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశం చేశారు. చైల్డ్ సేఫ్టీ పైన జెండర్ అండ్ ఈక్విటీ జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మి ఉపాధ్యాయులకు పలుసూచనలు చేశారు.కొత్తపల్లి పాఠశాలలో 23 మంది విద్యార్థులలో 100% విద్యార్థులు హాజరవడం వారందరూ ఎఫ్ఎల్ఎస్ హాజరులో నమోదవడం పట్ల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయబృందాన్ని జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు అభినందించారు.కొత్తపల్లి పాఠశాలకి కలెక్టర్ ఇటీవల బాలికల మరియు బాలుర టాయిలెట్స్ ని మంజూరు చేశారని సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీర్ సహకారంతో త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానని ఈసందర్భంగా మండల విద్యాధికారి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు.

## గ్రామాలలో అభివృద్ధిని చేపట్టి ప్రజల ఆదరణను పొందాలి

**ఎంపికైన సర్పంచ్ లకు సన్మానసభలో దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే గడ్డంవినోద్**



**బెల్లంపల్లి, మహా :** నూతనంగా ఎంపికైన గ్రామాల సర్పంచులు సంబంధిత గ్రామాలలో అభివృద్ధిని చేపట్టి ప్రజల ఆదరణను మెప్పును పొందాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచించారు. శుక్రవారం రోజు బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్లకు బెల్లంపల్లి శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఘనంగా సన్మానించారు.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల విశ్వాసంతో గెలుపొందిన కాసిపేట మండల నూతన సర్పంచ్లను బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరంఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి, గ్రామ స్వయంపాలనకు ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని,ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోతెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీల బలోపేతానికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలే రాష్ట్రఅభివృద్ధికి పునాది అని, ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సర్పంచ్లకు సూచించారు. తాగునీరు, పారిశుధ్యం,రోడ్లు,విద్యుత్, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాల్సిన బాధ్యత సర్పంచ్ లదేనని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలతో గ్రామీణ ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడుతుందని తెలిపారు. పార్టీ, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచిర్యాలజిల్లా అధ్యక్షులు పిన్నింటిరఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బన్నలక్ష్మన్ దాస్, రాపర్తి శ్రీనివాస్,విక్రమ్ రావ్,ఉత్తురి సత్తయ్య,నస్పూరి నర్సింగం, రౌతు సత్తయ్య,దారవేణి రాజయ్య,రేషవేని బాపుగోలేటి స్వామి,రమేష్,బుక్య రాంచందర్,పుర కుమార స్వామి,భూక్య రవి,దుస్స చందు, శిలార్ఖాన్,భీమ్నాయక్,ఆత్రంజంగు,మండలసర్పంచ్ లు బాదావత్ నీల,చాకటి సుగుణ,దుస్స విజయ, భూక్య స్వప్న, భూక్య చైతన్య,బాణోత్ రాణి,నవనందుల పుష్పలత,మాదావి వెంకటేష్,పంద్రం శంకర్,ఆడే దివ్య,ఉప సర్పంచ్ లు రమేష్,సూరం కిషన్,ఆల్కరాజు మెంద్రపు రాజయ్య, శారద, మల్లెత్తుల సందీప్, మద్దెవేని వేణు,పానుగంటి అశోక్,నగేష్,నామాసాని రాజు,మారం లచ్చన్న,బలరాం, స్వామి,షారుక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలి

**టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్**



**ఆమనగల్లు, మహా:** గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా చేయాలని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కడ్తాల్ మండలం ఎక్వాయి పల్లి గ్రామ సర్పంచ్ పాలకుర్ల కరుణాకర్ గౌడ్ హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాస సముదాయంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా యువత రాజకీయాల్లో రాణించాలని,ప్రజా సేవకు అంకితం కావాలని,ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదాన్ని కాపాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో మౌళిక వసతులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్ర తిఒక్కరికి అందేలా కృషి చేయాలని పిలుపుఇచ్చారు. బీసీ లు రాజకీయంగా ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందాలని.త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లు పై సభ ముందు ఉంచి చర్చిస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ నాయకులు రవికాంత్ గౌడ్,గోపాల్ రెడ్డి ,చరణ్ , సందీప్,పాండు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్ నిర్వహణపై అవగాహన అవసరం



**మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ**

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణపై రైతులకు అవగాహన అవసరమని మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవసాయ, సహకార శాఖ అధికారులు, ఎరువుల డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎరువుల బుకింగ్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా నిజమైన సాగుదారులకు జిల్లాలో యూరియా నిల్వల సమాచారం తెలుస్తుందని, ఎరువుల షాపుల వద్ద రద్దీ లేకుండా ఇంటి వద్దనే తమ మొబైల్ లో యాప్ వినియోగించి ఎరువులను (యూరియా) 24 గంటలలో పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు వారు నిర్వహించవలసిన విధులపై అవగాహన కల్పించడం జరిగిందని, ఈ నెల 20 నాటి నుండి యాప్ అందుబాటులో వస్తుందని తెలిపారు. ఈ యాప్ ద్వారా మాత్రమే యూరియా బుక్ చేసుకుని రైతులు/సంబంధికులు బుకింగ్ ఐ.డి., పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు పత్రాలను డీలర్ వద్ద ధ్రువీకరించుకొని యూరియా బస్తాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్, మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శులు, ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



**చెన్నూర్ / మంచిర్యాల, మహా :** చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం చెన్నూరులో అంబేద్కర్ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవానికి మంత్రి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇందులో భాగంగా చెన్నూర్ మండల కేంద్రంలో 20 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఆ భవనం మరింత విస్తరించేందుకు అదనంగా మరో 20 లక్షల రూపాయలను మంజూరు చేసి అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టామని వెల్లడించారు. ఈ కమ్యూనిటీ భవనాన్ని దళిత సంఘాలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిర్దేశిత నిబంధనలతో భవన నిర్వహణ కొరకు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇదే తరహాలో భీమారం మండలంలో 25 లక్షల రూపాయలతో నేతకాని భవనం, జైపూర్ మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో జగ్జీవన్ రామ్ భవనం, చెన్నూర్ మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో ముదిరాజ్ భవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా భవనాలకు అదనపు నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ భవన నిర్మాణం కొరకు ఎవరైనా భూమి కలిగి దాతలు ముందుకు వస్తే ప్రభుత్వం తరఫున భవన నిర్మాణానికి సహకారం అందిస్తానని భరోసా పలికారు. చెన్నూర్ నియోజకవర్గంలో 15 కోట్ల రూపాయలతో సి. సి. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. వచ్చే విడతలో 70/80 కోట్ల రూపాయలు మంజూరు చేసి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ప్రజలకు త్రాగునీటి కొరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమృత్ పథకం ద్వారా నీటి ట్యాంకులు, పైప్ లైన్లు ఏర్పాటు చేసి నిరంతరం త్రాగునీరు అందిస్తున్నామని వివరించారు. చెన్నూరు ప్రాంతంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని, మే నెల వరకు ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు, ఆసుపత్రిలో తగినంత సిబ్బంది నియామకానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం 9 కోట్ల 55 లక్షల రూపాయల టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో చేపట్టిన సమీకృత కూరగాయల మార్కెట్ ను ప్రారంభించారు. ప్రజలందరికీ ఒకే చోట కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచేందుకు సమీకృత మార్కెట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, మాంసకు ఉత్పత్తులకు సంబంధించి మార్కెట్లో నెలకొన్న సాంకేతిక సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూరు మండల కేంద్రంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మాత శిశు ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి కిడ్నీ బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకం క్రింద చెన్నూర్ మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 40 కోట్ల రూపాయలు, మందమర్రి మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలతో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఎ సి పి వెంకటేశ్వర్లు, చెన్నూర్ తహసిల్దార్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇన్‌స్టాగ్రామ్ కొత్త రూల్

**యూజర్లకు అలర్ట్**

**మహా:** ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్ కొత్తరూల్‌ను తీసుకొచ్చింది. హ్యాష్‌ట్యాగ్‌ల వినియోగంపై పరిమితి విధిస్తున్నట్లు తన ఖాతాదారులకు అలర్ట్ జారీ చేసింది. కాబట్టి ఇక మీద వాటిని పోస్ట్ చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఇన్‌స్టాగ్రామ్ వాడేవాళ్లకు సూచిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో చేసే పోస్ట్ లేదంటే రీల్‌కు ఇక నుంచి గరిష్ఠంగా ఐదు మాత్రమే హ్యాష్‌ట్యాగ్‌లు పెట్టుకునే అవకాశముందని ఆ ప్రకటనలో పేర్కొంది. తక్కువ యాష్ ట్యాగ్‌ల వల్ల పోస్టు బలంగా యూజర్లలోకి వెళ్తుందని.. తద్వారా రీచ్ బాగా అవుతుందని చెబుతోంది. ఇంతకుముందు ఇన్‌స్టాలో 30 హ్యాష్‌ట్యాగ్‌లు పెట్టుకోవడానికి అవకాశముండేది. అయితే.. ఎక్కువ, అసాధారణమైన హ్యాష్‌ట్యాగ్‌లు వాడటం వల్ల కంటెంట్ పనితీరు తగ్గుతుంది. అదే తక్కువగా.. అదీ నిర్దేశిత హ్యాష్‌ట్యాగ్‌లు వాడడం వల్ల కంటెంట్ డిస్కవరీకి ఎక్కువ అవకాశం ఉంటుందని ఇటు నిపుణులూ సూచిస్తున్నారు.

## బ్రహ్మపుత్రపై చైనా జల యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)



ప్రాంతంలోని 'గ్రేట్ బెండ్' వద్ద ఈ ప్రాజెక్టును నిర్మిస్తోంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దదైన త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే మూడు రెట్లు ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉండటమే కాకుండా, భారత సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ సూపర్ డ్యామ్ నిర్మాణం పూర్తయితే అరుణాచల్ ప్రదేశ్, అస్సాం వంటి ఈశాన్య రాష్ట్రాలకు నీటి సరఫరాపై చైనాకు పూర్తి పట్టు లభిస్తుంది. యుద్ధ సమయాల్లో లేదా ఉద్రిక్త పరిస్థితుల్లో చైనా ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే ఈశాన్య భారతం జలమయమయ్యే ప్రమాదం ఉంది, అలాగే వేసవిలో నీటిని నిలిపివేస్తే తీవ్రమైన కరువు ఏర్పడే అవకాశం ఉంది. డ్రాగన్ దేశం వేస్తున్న ఈ భారీ వ్యూహాన్ని గమనించిన భారత్, దానికి చెక్ పెట్టేందుకు అంతే దీటైన రీతిలో మెగా కౌంటర్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం అరుణాచల్ ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో సుమారు 11,000 మెగావాట్ల సామర్థ్యంతో ఒక భారీ జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు ద్వారా చైనా వైపు నుంచి వచ్చే ఆకస్మిక వరదలను అడ్డుకోవడంతో పాటు, నీటిని నిల్వ చేసే భారీ రిజర్వాయర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. చైనా నిర్మిస్తున్న సూపర్ డ్యామ్ వల్ల కలిగే దుష్ప్రభావాలను ఈ ఇండియన్ ప్రాజెక్ట్ సమర్థవంతంగా ఎదుర్కోగలదని జలశక్తి శాఖ నిపుణులు భావిస్తున్నారు. ఈ వ్యూహాత్మక నిర్మాణం ద్వారా అటు విద్యుత్ అవసరాలు తీరడమే కాకుండా, ఇటు నదీ జలాలపై భారత సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది. సరిహద్దుల్లో చైనా చేసే ప్రతి కదలికపై భారత్ నిఘా పెంచుతూనే, ఈ జల యుద్ధంలో పైచేయి సాధించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది.

## హైదరాబాద్‌లో రకుల్ ప్రీత్

**మహా:** తెలుగులో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్, తాను మళ్లీ తెలుగు సినిమాల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నానని, 'బాహుబలి' వంటి గొప్ప చిత్రంలో నటించడం తన కల అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని పంజాగుట్టలో ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ కడాలి చక్రవర్తి (చక్రి) కొత్తగా ఏర్పాటు చేసిన "సెకండ్ స్కిన్ మేకప్ స్టూడియో & అకాడమీ"ని రకుల్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, తెలుగు చిత్ర పరిశ్రమతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నాకు తొలి విజయాన్ని అందించింది తెలుగు సినిమానే. ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరించారు. ఈ మధ్య కాలంలో తెలుగు సినిమాలు చేయకపోవడంతో అందరినీ చాలా మిస్ అవుతున్నాను. మంచి కథ దొరికితే తప్పకుండా నటిస్తాను. నా అభిమానులంతా నా కోసం ప్రార్థించండి" అని రకుల్ కోరారు. హైదరాబాద్‌లో ఉండి షూటింగ్ చేయాలనే కోరిక బలంగా ఉందని, ప్రస్తుతం కొన్ని కథలు వింటున్నానని ఆమె వెల్లడించారు.

## పేద విద్యార్థి విద్యారుణం కోసం తన ఇల్లు ష్యూరిటీ పెట్టిన మాజీ మంత్రి హరీష్ రావు

ఆ యువతికి ఆర్థిక కష్టాలు అడ్డురాగా, ఆమె కల నెరవేర్చడానికి హరీశ్ రావు ఏకంగా తన సొంత ఇంటినే బ్యాంకులో హామీగా పెట్టి విద్యా రుణం ఇప్పించారు. సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన ఓ టైలర్ కుమార్తె కష్టపడి చదివి మెడిసిన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం పీజీలో సీటు సంపాదించినప్పటికీ, భారీ ఫీజులు చెల్లించడం ఆ కుటుంబానికి భారంగా మారింది. చేతిలో చిల్లిగవ్వ లేక, బ్యాంకుల్లో లోన్ పుట్టక ఆ విద్యార్థిని చదువు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆ కుటుంబం తమ ఎమ్మెల్యే హరీశ్ రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకుంది. సాధారణంగా ఇలాంటి సమయాల్లో ఎవరైనా సిఫార్సు లేఖలు ఇస్తారు, కానీ హరీశ్ రావు ఆ యువతి ప్రతిభను గుర్తించి, ఎలాగైనా ఆమెను ఉన్నత విద్యావంతురాలిని చేయాలని నిర్ణయించుకున్నారు. విద్యా రుణం రావడానికి సెక్యూరిటీ సమస్యగా మారడంతో, ఏమాత్రం సంకోచించకుండా తన సొంత ఇంటి డాక్యుమెంట్లను బ్యాంకులో హామీగా పెట్టారు. తద్వారా సుమారు రూ. 20 లక్షల రుణం ఆ విద్యార్థినికి అందేలా చేశారు. కేవలం లోన్ ఇప్పించడమే కాకుండా, తక్షణ అవసరాల కోసం తన వ్యక్తిగత ఖాతా నుంచి రూ. 1 లక్ష నగదును కూడా ఆ కుటుంబానికి అందజేశారు. బాగా చదువుకుని సమాజానికి సేవ చేయాలని ఆ విద్యార్థినికి భరోసా ఇచ్చారు. ప్రజాప్రతినిధి అంటే కేవలం ఓట్లు వేయించుకోవడం మాత్రమే కాదు, ప్రజల కష్టాల్లో భాగస్వామి కావాలని ఆయన నిరూపించారు. తన నియోజకవర్గ ప్రజలను సొంత కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నారు హరీష్ రావు. ఒక సామాన్య టైలర్ బిడ్డ డాక్టర్ కావాలనే ఆశయానికి తన ఇంటినే తాకట్టు పెట్టిన హరీశ్ రావు నియోజకవర్గ ప్రజల దృష్టిలో మరింతగా ఇమేజ్ పెంచుకున్నారు





# ప్రైవేట్ జెట్లలోనే ప్రభాస్ ప్రయాణం..

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు నటీనటులు అత్యంత విలాసవంతమైన జీవనశైలిని గడుపుతూ ఉంటారని తెలిసిదే.. వారు "రాజులా జీవించడం" అనే పదబంధానికి నిజంగా ప్రాణం పోసుకుంటారు. వారికి సంబంధించిన ఖరీదైన ఆస్తులు తరచుగా మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. కనీసం ఒక్కసారైనా సరే విమానంలో ప్రయాణించాలనే కోరిక ప్రతి సామాన్యుడిలో ఉంటుంది. కానీ, సినిమా నటీనటులకు సొంతంగానే కోట్ల విలువైన ప్రైవేట్ జెట్‌లు కూడా ఉన్నాయి. చిరంజీవి, నాగార్జున, అల్లు అర్జున్, ప్రభాస్, నయనతార వంటి వారికి లగ్జరీ జెట్‌లు ఉన్న విషయం తెలిసిందే. అయినప్పటికీ వీరందరూ ఒక్కోసారి పబ్లిక్ విమానంలోనే ప్రయాణం చేస్తుంటారు. కానీ, ప్రభాస్ మాత్రం ఎప్పుడు కూడా ప్రైవేట్ జెట్లలో ప్రయాణం చేయడానికి ఇష్టపడుతుంటారు. అందుకు సంబంధించి కారణాలు కూడా ఉన్నాయి.

ప్రభాస్ వాణిజ్య విమానాల్లో కాకుండా ప్రైవేట్ జెట్లలో మాత్రమే ప్రయాణించడానికి ఇష్టపడతారని సోషల్‌మీడియాలో చర్చ జరుగుతూనే ఉంటుంది. ఈ అంశంలో కొందరు తనని తప్పుగా కూడా అనుకుంటూ ఉంటారు. ఇటీవల, ఒక నిర్మాతను ప్రభాస్ తన టీమ ్కోసం USAకి ప్రైవేట్ జెట్ బుక్ చేయమని అడిగినట్లు వార్తలు వచ్చాయి. అనేక కారణాలు ఊహాగానాలు వచ్చినప్పటికీ, మరికొందరు కొన్ని ప్రధాన అంశాలను తెలిపారు. ప్రభాస్ ఎప్పుడు కూడా ఇతరుల నుంచి ఏదీ ఆశించరు. తన వ్యక్తిగత ప్రయాణాలు ఉంటే అందుకు కావాల్సిన డబ్బు తనే సమకూర్చుకుంటారు. సినిమాకు సంబంధించి ఏదైనా షెడ్యూల్ ఉంటే ఆయా నిర్మాతలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. అంతేకానీ నిర్మాతల చేత అవసరం లేని ఖర్చులు పెట్టించరు అనే మంచి పేరు తనకు ఉంది.

ప్రభాస్ చేతిలో ప్రస్తుతం స్పిరిట్, రాజాసాబ్, సలార్ 2, కల్కి 2 వంటి భారీ చిత్రాలు ఉన్నాయి. అయితే, ఒక్కో చిత్రంలో ఒక్కో గెటప్‌లో ఆయన కనిపించనున్నారు. ఈ కారణం వల్లే తన లుక్‌ను బహిరంగంగా వెల్లడించకూడదని మేకర్స్ సూచిస్తారు. యాదృచ్ఛికంగా పబ్లిక్‌లో ఆయన కనిపిస్తే అతని లుక్‌ను లీక్ చేసి వైరల్ చేస్తారు. గతంలో ఆది పురుష్ విడుదలకు ముందు ప్రభాస్ బహిరంగ ప్రదేశంలో కనిపించగానే కొందరు ఫోటోలు తీసి వైరల్ చేశారు. దీంతో జాతీయ స్థాయి ట్రోలింగ్‌కు దారితీసిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి వాటిని నివారించడానికి, వాణిజ్య విమానాల్లో ప్రయాణం చేసేందుకు ఆయన ఇష్టపడరని సమాచారం.

వాస్తవంగా ప్రభాస్ జీవనశైలి ఇతర హీరోలకు భిన్నంగా ఉంటుంది. ఉదార స్వభావంతో పలు సందర్భాల్లో భారీగా విరాళాలు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎలాంటి విషయంలోనైనా సరే పూర్తిగా రాజీ పడకుండా జీవిస్తారు. స్నేహితులతో కలిసి ప్రైవేట్ జెట్‌లలో ప్రయాణించడానికే ఎక్కువగా ఇష్టపడతారు. సినిమా సెట్స్‌లో అందరికీ భోజనాలు తెప్పించి వారితో కలిసి సంతోషంగా గడిపేందుకు ఆసక్తి చూపుతారు. ఎప్పుడు కూడా ఒక రాజులాగే ఉండాలని తన జీవనశైలిని ఆస్వాదిస్తారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తన పేరులోనే రాజు ఉంది.. ప్రభాస్ జీవితం కూడా రాజులాగే ఉంటుందని తన సన్నిహితులు కూడా చెబుతుంటారు.

# అవతార్: ఫైర్ అండ్ యాష్ మూవీ రివ్యూ

ప్రపంచ సినీ చరిత్రలో ఓ సంచలనం 'అవతార్'. హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన విజువల్ వండర్ ఇది. 2009లో రిలీజైన ఈ చిత్రం.. అతిపెద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అప్పటి వరకు వెండితెరపై చూడని విజువల్స్‌ని చూపించి.. సరికొత్త ప్రపంచానికి తీసుకెళ్లాడు కామెరూన్. ఈ సినిమాకు కొనసాగింపుగా నాలుగు సీక్వెల్స్ ఉంటాయని అప్పడే ప్రకటించిన కామెరూన్.. పార్ట్ 2 అవతార్: ది వే ఆఫ్ వాటర్' ని 2022లో రిలీజ్ చేశాడు. ఆ చిత్రం ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది. కానీ కలెక్షన్స్ పరంగా మాత్రం రికార్డు సృష్టించింది. ఇక ఇప్పుడు అవతార్‌కి రెండో సీక్వెల్‌గా 'అవతార్: ఫైర్ అండ్ యాష్'(Fire And Ash Movie Review) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి ఈ చిత్రం ఎలా ఉందో రివ్యూలో చూద్దాం.

**కథేంటంటే..**


పెద్ద కొడుకు నితాయాం చనిపోయిన తర్వాత జేక్ సల్లీ(శ్యామ్ వర్తింగ్టన్), నేతిరి(జో సల్డానా) జంట తీవ్రమైన విషాదంలో కూరుకొనిపోతుంది. మిగిలిన పిల్లలు లోక్(బ్రిటన్ డాల్టన్), టూక్(ట్రినిటీ జో-లి బ్లిస్), కిరి (సిగౌర్నీ వీవర్)తో పాటు దత్తపుత్రుడు స్పైడర్(జాక్ ఛాంపియన్)ని కాపాడుకుంటూనే.. కొడుకు చావుకు కారణమైన మానవ సైన్యంపై ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధం అవుతారు. అదే సమయంలో అవతార్ 2లో చనిపోయిన కల్నల్ క్వారిచ్(స్టీఫెన్ లాంగ్).. నావి తెగకు చెందిన వ్యక్తిలా మళ్లీ జీవం పోసుకొని వస్తాడు. అతనికి అగ్ని తెగకు చెందిన నాయకురాలు వరంగ్(ఊనా చాప్లిన్) సహాయం చేసేందుకు ముందుకు వస్తుంది. వరంగ్‌కి జేక్ సల్లీ ప్యామిలీ కొలిచే ఈవా దేవత అంటే నచ్చదు. అదే కోపంతో కల్నల్ క్వారిచ్‌తో చేతులు కలుపుతుంది. మరోవైపు పండోరా గ్రహాన్ని నాశనం చేయాలనుకున్న ఆర్డీఏ బృందం కూడా వీరికి తోడుగా నిలుస్తుంది. బలమైన ఈ ముగ్గురు శత్రువుల నుంచి జేక్ సల్లీ తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే అవతార్ 3 కథ.

**ఎలా ఉందంటే..**


'అవతార్'లో పండోరా గ్రహాన్ని సృష్టించి, ప్రకృతి అందాలను చూపించిన జేమ్స్ కామెరూన్.. పార్ట్ 2 సముద్ర గర్భంలోని సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాడు. అయితే అవతార్ 2 సమయంలోనే కథ-కథనంపై విమర్శలు వచ్చాయి. కానీ విజువల్స్ అద్భుతంగా ఉండడంతో సినిమాకు భారీ కలెక్షన్స్ వచ్చాయి. ఇక మూడో భాగంగా వచ్చిన 'అవతార్: ఫైర్ అండ్ యాష్'లోనూ కథ- కథనమే మైనస్ అయింది. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. కానీ కథ-కథనంలో మాత్రం కొత్తదనం లేదు. విజువల్స్ చూడడానికి బాగున్నా.. వావ్ ఫ్యాక్టర్ మాత్రం మిస్ అయింది. అవతార్, అవతార్ 2లో చూసిన సన్నివేశాలే.. పార్ట్ 3లోనూ కనిపిస్తాయి. అగ్నితెగ ఒక్కటి ఇందులో యాడ్ చేశారు. అంతకు మించి పార్ట్ 2కి, పార్ట్ 3కి పెద్ద తేడా లేదు. పైగా నిడివి చాలా ఎక్కువగా (దాదాపు 3 గంటల 17 నిమిషాలు) ఉండడంతో .. చాలా సన్నివేశాలు సాగదీతగా అనిపిస్తాయి. ముఖ్యంగా ఫస్టాఫ్ ప్రేక్షకుడి సహనానికి పరీక్షలా మారుతుంది. చూసిన సన్నివేశలే మళ్లీ మళ్లీ రావడం.. కథ అక్కడక్కడే తిరగడంతో 'విరామం' పడితే బాగుండేది కదా అనే ఫీలింగ్ కలుగుతుంది. ఉన్నంతలో సెకండాఫ్‌లో కథ కాస్త పరుగులు పెడుతుంది. వరంగ్, కిరి మధ్య వచ్చే సన్నివేశాలు, యాక్షన్ సీన్లు ఆకట్టుకుంటాయి. అలాగే స్పైడర్ పాత్ర నేపథ్యంలో వచ్చే కొన్ని సీన్లు హృదయాలను హత్తుకుంటాయి. బంధీ అయిన జేక్ సల్లీని విడిపించేందుకు నేతిరి రావడం..ఈ క్రమంలో వచ్చే పోరాట ఘట్టాలు బాగుంటాయి. క్లైమాక్స్ విజువల్స్ పరంగా బాగున్నా.. అవతార్ 2లోని క్లైమాక్స్‌ని గుర్తు చేస్తుంది. మొత్తంగా జేమ్స్ కామెరూన్ మార్క్ ఎమోషన్, స్క్రీన్‌ప్లే ఈ చిత్రంలో మిస్ అయింది. వీఎఫెక్స్ పనితీరు మాత్రం ఇంతకు ముందు వచ్చిన రెండు పార్టుల కంటే బాగుంటుంది. కథ పరంగా చూస్తే.. అవతార్ 3 రొటీన్ చిత్రమే కానీ.. సాంకేతికంగా మాత్రం అవతార్ 3 ఓ అద్భుతమే. విజువల్ గ్రాండియర్ కోసమే అయినా ఈ సినిమాను తెరపై ఒక్కసారి చూడొచ్చు.

## ఎవరెలా చేశారంటే..

జేక్ సెల్లీ పాత్రకు సామ్ వర్తింగ్టన్ పూర్తి న్యాయం చేశాడు. ఓ తెగ నాయకుడిగా, పిల్లలకు మంచి తండ్రిగా చక్కని నటన కనబరిచాడు. యాక్షన్ సీన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నేతిరి పాత్రలో జో సల్డానా ఒదిగిపోయింది. పార్ట్ 2తో పోలిస్తే..ఇందులోనే ఆమెకు ఎక్కువ యాక్షన్ సీన్స్ పడ్డాయి. ఇక ఈ సినిమాకు కొత్తతనం తెచ్చిన పాత్ర వరంగ్. ఆ పాత్రలో ఊనా చాప్లిన్ జీవించేసింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలలో ఆమె నటన ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. సిగర్నీ వీవర్, బ్రిటన్ డాల్టన్‌తో పాటు మిగిలిన నటీనటులు తమ పాత్రల పరిధిమేర నటించారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. , రస్సెల్ కార్పెంటర్ సినిమాటోగ్రఫీ సినిమాకు మరో ప్రధాన బలం. సైమన్ ఫ్రాంగ్లెన్ నేపథ్య సంగీతం ఓకే. ఎడిటర్ తన కత్తెరకు బాగా పని చెప్పాల్సింది. సినిమాలో కట్ చేయాల్సిన సీన్లు చాలానే ఉన్నాయి. కొన్ని సన్నివేశాలను తొలగించినా.. అసలు కథకు ఇబ్బందేమి లేదు. అలాంటి సీన్లను తొలగించి నిడివి తగ్గించి ఉంటే బాగుండేది. నిర్మాణ విలువలు బాగున్నాయి.



# ధురంధర్ ఓటీటీ @రూ.130 కోట్లు



ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్లో బాక్సాఫీస్ దగ్గర రచ్చ లేపుతున్న సినిమా 'ధురంధర్'. పేరుకే హిందీ మూవీ అయినప్పటికీ దక్షిణాదిలోనూ మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి వసూళ్లు నమోదవుతున్నాయి. చూసిన చాలామందికి ఇది నచ్చేస్తోంది. మరికొందరు మాత్రం ఓటీటీలోకి వచ్చిన తర్వాత చూసుకోవచ్చులే అనుకుంటారు. ఈ క్రమంలోనే 'ధురంధర్' డిజిటల్ డీల్ గురించి సోషల్ మీడియాలో రూమర్స్ వినిపిస్తున్నాయి. రణ్‌వీర్ సింగ్, అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ తదితరులు ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో కనిపించారు. 'ఉరి' ఫేమ్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహించాడు. రిలీజ్‌కి ముందు ఓ మాదిరి హైప్ మాత్రమే ఉంది. ఎప్పుడైతే థియేటర్లలోకి వచ్చిందో బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం రూ.700 కోట్ల వరకు కలెక్షన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. దీనికి సీక్వెల్ కూడా ఉందని ప్రకటించారు. రాబోయే మార్చి 19న అది థియేటర్లో ఇది విడుదల కానుంది. అసలు విషయానికొస్తే.. 'ధురంధర్' డిజిటల్ హక్కుల్ని నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. అయితే రూ.130 కోట్లకు ఈ డీల్ జరిగిందని కొన్నిరోజుల క్రితం రూమర్స్ రాగా.. ఇప్పుడు ఏకంగా రూ.285 కోట్లతో ఒప్పందం జరిగిందని అంటున్నారు. ఏదేమైనా ఏదో ఒకలా సోషల్ మీడియాలో ఈ మూవీ గురించి డిస్కషన్ నడుస్తోంది. 'ధురంధర్' స్ట్రీమింగ్ విషయానికొస్తే థియేటర్లలోకి వచ్చిన 8 వారాల తర్వాతే స్ట్రీమింగ్ చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అంటే వచ్చే జనవరి 30న నెట్‌ఫ్లిక్స్‌లో ఇది వచ్చే ఛాన్స్ ఉంది. ఇకపోతే తెలుగు డబ్బింగ్ రిలీజ్ ఉందని మాట్లాడుకుంటున్నారు కానీ ఇంతవరకు ఈ విషయంపై క్లారిటీ అయితే రాలేదు.



# ఆ టైమ్‌లో మగాళ్లకు పెళ్లాలు గుర్తుకు రారు

మాస్ జాతర తర్వాత రవితేజ నటించిన లేటేస్ట్ మూవీ భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఈ సినిమాకు కిశోర్ తిరుమల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో నాసామిరంగ బ్యూటీ ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీ రిలీజ్‌కు కొద్ది రోజులు మాత్రమే ఉండడంతో మేకర్స్ ప్రమోషన్స్‌తో బిజీ అయిపోయారు. ఇప్పటికే ఓ రొమాంటిక్ లవ్ సాంగ్ రిలీజ్ చేసిన మేకర్స్.. తాజాగా టీజర్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే ఫుల్ కామెడీతో పాటు భార్య, భర్తల మధ్య జరిగే సీన్స్ ఆడియన్స్‌కు నవ్వులు తెప్పిస్తున్నాయి. టీజర్ చివర్లో వదిన వాళ్ల చెల్లి అంటే నా వైఫేగా అనే రవితేజ కామెడీ పంచ్ డైలాగ్ ఫ్యాన్స్‌ను అలరిస్తోంది. ఇంకెందుకు ఆలస్యం భర్త మహాశయులకు విజ్ఞప్తి టీజర్ చూసేయండి. కాగా.. ఈ సినిమా 2026 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# దక్షిణాది నిర్మాత హోటల్‌కు రమ్మన్నాడు

సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ పదం ఎక్కువగా వినిపిస్తూ ఉంటోంది. సినీతారలు ఏదో ఒక సందర్భంలో అలాంటి అనుభవాన్ని ఎదుర్కొనే ఉంటారు. కొందరు వాటిని బహిరంగంగా మాట్లాడితే.. మరికొందరు బయటికి చెప్పలేక సతమతమవుతుంటారు. గతంలో చాలామంది హీరోయిన్స్ తమకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకున్నారు. తాజాగా మరో నటి తనకెదురైన క్యాస్టింగ్ కౌచ్ ఎక్స్‌పీరియన్స్‌ను షేర్ చేసింది. బాలీవుడ్ నటి, స్టార్ క్రికెటర్ దీపక్ చాహర్ సోదరి అయిన మాల్టీ చాహర్ ఇటీవలే సల్మాన్ ఖాన్ బిగ్‌బాస్ సీజన్ 19లో కనిపించింది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌కు హాజరైన మాల్టీ చాహర్ తాను కూడా క్యాస్టింగ్ కౌచ్ బారిన పడినట్లు తెలిపింది. కెరీర్ ప్రారంభంలో ఇలాంటి అనుభవం ఎదురైందని చెప్పుకొచ్చింది. ఫిల్మ్ ఇండస్ట్రీలో పరిస్థితులు, క్యాస్టింగ్ కౌచ్ సంఘటనల గురించి మాట్లాడింది. తనకు క్యాస్టింగ్ డైరెక్టర్లతో ఎలాంటి సమస్య రాలేదని మాల్టీ చాహర్ తెలిపింది. ఏ క్యాస్టింగ్ డైరెక్టర్ కూడా నాతో అసభ్యంగా ప్రవర్తించలేదని వెల్లడించింది. అయితే ఓ దర్శకుడు మాత్రం వర్క్ పరంగా మాట్లాడే సమయంలో అనుచితంగా ప్రవర్తించాడని వివరించింది. ఆ వేధింపులు ఎప్పుడూ ప్రత్యక్షంగా ఉండేవి కావని.. వారి ఉద్దేశ్యాన్ని బయటికి చెప్పకుండా అలాంటి హింట్స్ ఇస్తారని మాల్టీ తెలిపింది. ఓ దక్షిణాది నిర్మాతతో సమావేశమైనప్పుడు అతని హోటల్ రూమ్ గది నంబర్ తనకు ఇచ్చాడని ఆ అనుభవాన్ని పంచుకుంది. అలాంటి పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నానని తెలిపింది. ఆ సమయంలో నేను అర్థం కానట్లు నటించానని.. ఆ తర్వాత మేము మళ్లీ కలుసుకోలేదని మాల్టీ చెప్పుకొచ్చింది. మాల్టీ చాహర్ మాట్లాడుతూ..'ఒక ఆఫీస్ మీటింగ్‌లో వీడ్కోలు సమయంలో తనకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. సాధారణ ఆలింగనం అని భావించా. కానీ అతను నన్ను ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నించాడు. అది నాకు చాలా అసౌకర్యంగా



అనిపించింది. వెంటనే అతన్ని అడ్డుకుని.. ఆ తర్వాత అతనితో అన్ని సంబంధాలను తెంచుకున్నా. అక్కడే అతన్ని నిలదీశా. అతన్ని నా తండ్రిలా భావించా. ఆ సంఘటన నాకు ఒక గుణపాఠం నేర్పింది. ఎవరినీ కూడా ఉన్నత స్థానంలో ఉంచొద్దు. 'అని అన్నారు. మహిళలు అవకాశాల కోసం ఇలాంటి వాటికి అంగీకరించవద్దని సూచించింది. మనపై మనకు నియంత్రణ ఉండాలని కోరింది. కాగా.. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన ఈ బ్యూటీ 2018లో అనిల్ శర్మ దర్శకత్వం వహించిన బాలీవుడ్ చిత్రం జీనియస్ ద్వారా రూబీనా పాత్రను పోషించింది. అరవింద్ పాండే దర్శకత్వం వహించిన రొమాంటిక్ డ్రామా ఇష్క్ పాష్మినా (2022)లో ఒమిషా పాత్రను పోషించి తన నటనా నైపుణ్యాలను మరింతగా ప్రదర్శించింది. అనేక బ్రాండ్లకు ప్రచారకర్తగా కూడా ఆమె పనిచేస్తోంది. ఇన్‌స్టాలో గ్లామరస్ ఫొటోలు, ఫ్యాషన్ పోస్ట్‌లతో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. 2018లో ఐపీఎల్ మ్యాచ్‌లో మిస్టరీ గర్ల్‌గా ఫేమస్ అయ్యింది. ఆ తరువాత ఆమె దీపక్ చాహర్ సోదరి అని ప్రపంచానికి తెలిసింది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034